# సింగిల్ పేజి కథలు

## యూజ్ అండ్ త్రో



"రేయ్ ఆకాష్! చాయ్ తాగుదామా!" అడిగాడు ఈశ్వర్.

"పదా"

ఇద్దరూ ప్యారడైజ్ కేఫ్‌కి వెళ్ళారు. బిల్లు చెల్లించాక రెండు ప్లాస్టిక్ కప్పులలో చాయ్ అందించాడు సేల్స్‌మెన్.

ఆకాష్, ఈశ్వర్ కబుర్లు చెప్పుకుంటూ చాయ్ తాగాక, ప్లాస్టిక్ కప్పులను డస్ట్‌బిన్‌లో పడేసి బయటకు నడిచారు.

"సరేరా!..రేపు కలుద్దాం" అంటూ విడిపోయారు.

ఆకాష్ ఇంటి వైపు వెళ్తుంటే తల్లి పండ్లు తీసుకురమ్మని చెప్పడం గుర్తుకొచ్చింది. అతడు బైక్‌ని ఓ ఫ్రూట్ షాప్ ముందు ఆపి, పండ్లు కొన్నాడు. షాపువాడు ఆ పండ్లు ఓ ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లో వేసి అందించాడు.

ఇంటికెళ్ళాక అతడు తల్లికి ఆ బ్యాగ్ అందిస్తే, ఆవిడ ఫ్రూట్స్ ఫ్రిజ్‌లో పెట్టి, క్యారీ బ్యాగ్ డస్ట్‌బిన్‌లో పడేసింది.

ఆ సాయంత్రం ఆకాష్ తండ్రి అమర్‌నాథ్ భార్య రమాదేవితో అన్నాడు. "సెకండ్ షో సినిమాకి వెళ్దామా?"

"మీకు సినిమాకెళ్ళాలనే కోరిక కలగడమే అరుదు. అలాంటి మీరు అడిగాక, కాదనకుండా ఎలా వుండగలం?" ఆవిడ నవ్వింది.

ఆ రాత్రి ముగ్గురూ క్రాస్‌రోడ్స్‌లో సినిమాకెళ్ళారు.

హాలులో అమర్‌నాథ్ కూల్‌డ్రింక్ టిన్స్ తీసుకున్నాడు. డ్రింక్ తాగాక టిన్‌లు డస్ట్‌బిన్‌లో పడేసారా ముగ్గురూ.

* * *

ఆకాష్‌కి ఉద్యోగం వచ్చింది. ఆఫీసులో నీలిమ పరిచయమైంది. ఆ పరిచయం కలిసి సినిమాలు, షికార్లు తిరిగే వరకూ వెళ్ళింది. వారిద్దరూ అంతటితో ఆగలేదు. శారీరక సుఖాలనూ అనుభవించారు.

అలా కొంతకాలం గడిచాక నీలిమ అతడిని అడిగింది "ఆకాష్! మనమిక పెళ్ళిచేసుకుంటే బాగుంటుందనుకుంటాను"

"కానీ నేను బాగుంటుందని అనుకోవటం లేదు"

"ఎందుకని?"

"నీ మీద నాకు బోర్ కొట్టింది"

నీలిమ రెండు క్షణాల మౌనం తర్వాత ప్రశ్నించింది "మరి ఇప్పుడు నా పరిస్థితి?"

"చూడు నీలిమా! మన సమాజం ఎంతో ఫాస్ట్‌గా వుంది. ఏ బరువు బాధ్యతలు లేకుండా, అభిమానం, ఆప్యాయతలకు చోటు లేకుండా 'యూజ్ అండ్ త్రో' కాలంలో బ్రతుకుతున్నాం. ఇప్పుడు మనిద్దరం ఒకరినొకరు ఆనందం కోసం ఉపయోగించుకున్నాం. ఆ తర్వాత వదిలేస్తున్నాం. ఇట్స్ సింపుల్" జవాబిచ్చాడు అతడు.

"మరి ఈ విషయంలో నేను మీ మమ్మీడాడీలను కలిస్తే?"

"ఇలాంటి సమాధానమే వస్తుందనుకుంటాను"

"అదీ చూద్దాం" అంది నీలిమ.

నీలిమ చెప్పినదంతా ప్రశాంతంగా విన్నారు అమర్‌నాథ్, రమాదేవి.

"మరి మీ అభిప్రాయం ఏమిటి?" చివరగా అడిగింది ఆమె.

అమర్‌నాథ్ అరనిముషం ఆలోచించాక చెప్పాడు "మా వాడికి ఇష్టంలేని పని మేము చేయలేము కదమ్మా! ఐనా మావాడు చెప్పిన దాంట్లోనూ కొంత వాస్తవముంది. సమాజం మారింది. టీనేజ్‌లో కలసి తిరగడం కామన్ అయిపోయింది. కలిసి తిరిగినప్పుడు తప్పు జరగడం కామన్. తప్పు జరిగింది కదాని, ఇష్టం లేకుండా జీవితాంతం కలిసి బ్రతకాలనుకోవటమూ కష్టమే. ఈ విషయంలో మేమేమీ చేయలేం"

నీలిమ లేచింది. "సో! మీ అబ్బాయి చెప్పిన 'యూజ్ అండ్ త్రో' పాలసీని మీరూ సమర్థిస్తున్నారన్నమాట. ఓ.కె." ముఖంలో ఎలాంటి భావమూ కదలాడకుండా జాగ్రత్తపడుతూ వెళ్ళిపోయింది.

పెద్ద బరువు తగ్గినట్లు ఆ దంపతులు రిలాక్స్ ఫీలయ్యారు.

* * *

ఆకాష్‌కి కోమలితో పెళ్ళయ్యింది.

ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావడంతో విదేశాల్లో ఉద్యోగానికి అప్లయ్ చేసి, సంపాదించారు. కొడుకు, కోడలు అమెరికా వెళ్ళిపోయి ఇక తిరిగి రావటం లేదని తెలిసి అమర్‌నాథ్ కొడుకును అడిగాడు "ఆకాష్! ఈ వయసులో మమ్మల్ని ఇలా వదిలి అంతదూరం వెళ్ళడం ఎంతవరకూ న్యాయం?"

"మీరూ ఇలా మాట్లాడుతున్నారేంటి డాడీ! బరువు బాధ్యతలు అభిమానం ఆప్యాయత-ఇవన్నీ అమాయకమైన మాటలు. జీవితంలో ఇన్‌స్టెంట్‌గా దొరికే ఆనందాలకే విలువ ఇచ్చే తరం మాది. మీ కోసం ఆ ఆనందాలను వదులుకోవడం నాకిష్టం లేదు" చెప్పాడు ఆకాష్.

అమర్‌నాథ్ ఆవేశపడలేదు. "జీవితంలో ప్రతీదీ వాడుకుని పారేసే తరం వారిది ఆ 'యూత్ అండ్ త్రో' పాలసీని తనలాంటి కొంతమంది తల్లిదండ్రులు సమర్థిస్తున్నారు. అందుకే వాళ్ళు చివరికి తల్లిదండ్రులనూ 'యూజ్ అండ్ త్రో' అంటూ వదిలేసి వెళ్తున్నారు. విత్తు ఒకటి నాటితే చెట్టు మరోటి రాదు. వారి మనసుల్లో మనం నాటే భావాలే, మన పట్ల వారి చర్యలను నిర్దేశిస్తాయి తన కొడుకుకి తను 'యూజ్ అండ్ త్రో' పాలసీనే నేర్పాడు మరి'!

"మమ్మల్ని కూడా 'యూజ్ అండ్ త్రో' అంటూ వదిలించుకున్నందుకు థాంక్స్‌రా" కొడుకుకు షేక్‌హాండ్ ఇచ్చాడు అమర్‌నాథ్.

-జె.సునీల్ (హైదరాబాద్)

OOO

రెండు రోజులబట్టి శ్యామల యింటికెళదామంటే కుదరటం లేదు. రెండో శనివారం, ఆదివారం శ్రీవారికి, పిల్లలకీ కూడా శెలవే అవడం వల్ల తండ్రీ, పిల్లలు కలిసి యిల్లు పీకి పందిరేస్తున్నారు. ఆటలతో, పాటలతో, వాళ్ళకి కావలసినవన్నీ అవసరానికి తగ్గట్టు అందించకలేక నా తలప్రాణం తోక్కొస్తోంది.

సాధారణంగా నేనెవరిళ్ళకీ వెళ్ళాలనుకోను. తీరిక దొరికితే పుస్తకమేదేనా చదువుకోవడమో లేక గార్డెనింగో అదీకాకపోతే కుట్లు, అల్లికలతోనో కాలక్షేపం చేసేస్తాను. అయితే మొన్న పెరట్లో పూసిన కనకాంబరాలు కోసి పిల్లలు స్కూలునించి తిరిగి వచ్చేలోగా వచ్చేద్దామని పువ్వులు శ్యామలకివ్వ దానికని బయలుదేరా. మా యింటి పక్క వీధిలోనే వాళ్ళిల్లు. శ్యామల, నేను ఒకే వూరి వాళ్ళం. అక్కడ ఎక్కువ పరిచయం లేకపోయినా యిద్దరి అత్తవారి వూరు కూడా ఒకటే కావడంతో ఒక పేరంటంలో కలుసుకొని కబుర్లలో వివరాలు తెలుసుకొని పరిచయాలు పెంచుకొని ఒకరిళ్ళకొకరం అప్పుడ